క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న వెల్ఫేర్ అధికారి రాజశేఖర్

ధర్మపురి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని వసతి గృహాల జిల్లా వెల్ఫేర్ అధికారి రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆదివారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై వివరించారు. విద్యార్థులకు పోషక పదార్థాలతో కూడిన భోజనం, అల్పాహారం, స్నాక్స్ తదితర వాటిని అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు తయారు చేసిన భోజనం చేసి రుచికరంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమాధికారులు సుధాకర్, శిరీష తదితరులున్నారు.

పుస్తకం తరగని సంపద



రాజయ్య నీతి శతకం పుస్తకావిష్కరణ

కోరుట్లటౌన్: పుస్తకం తరగని సంపద అని కవి వోటారి చిన్న రాజన్న అన్నారు. స్వేచ్ఛ సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయ ఆవరణలో బొమ్మల మేడిపెల్లికి చెందిన కొత్తూరి రాజయ్య రచించిన రాజయ్య నీతి శతకం పుస్తకం ఆవిష్కరణ ఆదివారం నిర్వహించారు. పుట్టింది ప్రతిది గిట్టుతుంది,,కానీ పుస్తకానికి మరణం లేదు. పుస్తకాన్ని మించిన నేస్తంలేదు అని వక్తలు పేర్కొన్నారు. రచయిత రాజయ్యను స్వేచ్ఛ సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకులు రాస భూమయ్య సన్మానించారు. కార్యక్రమంలో కవులు రాస భూమయ్య, చెన్న విశ్వనాథం, రుద్ర నాగరాజు, శ్యాంసుందర్, విద్యాసాగరయ్య, బద్ది నర్సయ్య, కళ్యాణాచారి, కొత్తూరి రాజ్‌కుమార్, ముబ్రిమ్, ఎర్ర శంకర్, బి.నరేందర్, రాజబోసు, సాంబారి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న కడారి లత

వెల్గటూర్: బాల్య వివాహాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ సహాయ వెల్ఫేర్ ఎన్జీవో కౌన్సిలర్ కడారి లత అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ఈ నెల 12 నుంచి 14 వరకు ప్రపంచ వ్యాప్తంగా 39 దేశాలలో వివిధ మత పెద్దలతో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆదివారం జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం ముంజంపల్లి, శానబండ గ్రామాల్లో స్థానిక చర్చీల్లో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాల నిర్మూలన చట్టం – 2006 ప్రకారం రెండేళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని తెలిపారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ముంజంపల్లి, శానబండ పాస్టర్లు యోహన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిపెల్లిలో సత్యసాయి సంకీర్తన

రాయికల్: మండలంలోని కుమ్మరిపెల్లిలో సత్య సాయి బాబా 100వ జయంతి సందర్భంగా ఆదివారం జగిత్యాల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటింటా సాయి ప్రతీ ఇంట సాయి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సంకీర్తన బాలవికాస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి జగిత్యాల కన్వీనర్ బట్టు రాజేందర్, రాయికల్ ఇన్‌చార్జి గాజెంగి అశోక్, నిర్వాహకులు గంగరాజం తదితరులు పాల్గొన్నారు

నిరుపేద యువతి పెళ్లికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన సానియా బేగం అనే పేదింటి యువతి వివాహానికి ఎమ్మెల్యే సంజయ్ ఆర్థికంగా చేయూతనందించారు. యువతి వివాహానికి ఆమె తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోగా, ఆయన స్పందించి రూ.10వేల ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తాన్ని ఆదివారం నాయకులు ఆమె కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు కుటుంబ సభ్యులు తెలిపారు.

చెరువులకు చేరని చేప పిల్లలు

- పంపిణీలో తీవ్ర జాప్యం
- జిల్లాలో 765 చెరువులు
- 1.69 కోట్ల చేప పిల్లల పెంపకం లక్ష్యం
- నెలల తరబడిగా ఎదురుచూస్తున్న మత్స్యకారులు



కథలాపూర్ మండలం తాండ్ర్యాల చెరువు

కథలాపూర్: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసేది. వాటిని మత్స్యకారులు చెరువుల్లో, కుంటల్లో వదిలి పెరిగిన తర్వాత అమ్ముకొని జీవనోపాధి పొందేవారు. ఈ ఏడాది మాత్రం చేప పిల్లల పంపిణీపై ఇప్పటివరకు ఉన్నతాధికారులు ఏ నిర్ణయమూ తీసుకోకపోవడంతో గందరగోళం నెలకొంది. చేప పిల్లల పంపిణీ విషయంలో నెలల తరబడి జాప్యం జరుగుతుండడంతో పథకం ఉంటుందా..? ఎత్తివేస్తారా..? అని జిల్లాలోని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

765 చెరువులు.. 1.69కోట్ల పిల్లలు

జిల్లాలో 385 గ్రామాలున్నాయి. అలాగే ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో జలాశయాలు, చెరువులు, కుంటలు కలిపి 765 ఉన్నాయి. 272 మత్స్యకార సహకార సంఘాల్లో 18 మహిళా మత్స్యకార సహకార సంఘాలు కూడా ఉన్నాయి. ఆయా జలాశయాల్లో ఈ సీజన్‌లో పెద్ద సైజ్ చేప పిల్లలు 1.14 కోట్లు, 35 నుంచి 40 మిల్లీమీటర్ల సైజ్ గల చేప పిల్లలు 55 లక్షలు మత్స్యకారులకు అందించడం లక్ష్యంగా మత్స్యశాఖ అధికారులు నిర్ణయించి ప్రణాళిక తయారు చేశారు.

జూలైలో వదిలితే ప్రయోజనం..

చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో జూలై నెలలో కొత్తనీరు వచ్చి చేరుతుంది. జలాశయాల్లో అప్పుడే చేప పిల్లలను వదిలితే మంచి దిగుబడి వస్తుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో చేపలను చెరువుల్లో, కుంటల్లో వదిలితే నవంబర్, డిసెంబర్ వరకు ఎదిగి అమ్మకానికి పనికి వస్తాయని, తమకు ఎక్కువ కాలం ఉపాధి దొరుకుతుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. సెప్టెంబర్‌లో పిల్లలను వదిలితే కిలో బరువు పెరగడానికి ఫిబ్రవరి వరకు ఆగాల్సి వస్తుందంటున్నారు. అంతకంటే ఎక్కువ బరువు పెరగాలంటే వేసవికాలం వరకు వేచి చూడాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఎండ ప్రభావంతో చేపలు చనిపోయే ప్రమాదముందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి చేప పిల్లల పంపిణీపై జాప్యం చేయకుండా త్వరగా అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.



గతేడాది చేప పిల్లలను వదులున్న మత్స్యకారులు

త్వరగా పంపిణీ చేయాలి



చేప పిల్లలను జలాశయాల్లో ఎప్పుడు వదిలితే బాగా ఎదుగుతాయో మత్స్యశాఖ అధికారులకు తెలుసు. అయినప్పటికీ పంపిణీలో నెలల తరబడి జాప్యం చేయడం దారుణం. చేపలు పట్టి అమ్మితేనే మేం ఆర్థికంగా ఎదుగుతాం. అలాంటిది పిల్లల పంపిణీ ఆలస్యం చేస్తే ఎలా..? మా కుటుంబాలకు ఉపాధిలేక పోషణ కష్టమవుతుంది. ప్రభుత్వం తాత్సారం చేయొద్దు.

– దేశవేని గంగాధర్, మత్స్యకారుడు, తాండ్ర్యాల

నాణ్యమైన పిల్లలు అందించాలి



చేప పిల్లలు నాణ్యమైనవి అందించాలి. గతంలో పంపిణీ చేసినవి నాసిరకంగా ఉండటంతో అవి ఎదగలేదు. నెలల తరబడి చెరువుల్లో పెంచిన చేపలు విక్రయిద్దామని చూస్తే బరువు పెరగకపోవడంతో నిరాశకు గురయ్యాం. ఆర్థికంగా నష్టపోయాం. ఈసారి నాణ్యమైన చేప పిల్లలు అందించాలి. వీలైనంతా త్వరగా చెరువుల్లో చేపలను వదలితేనే మాకు లాభం.

– అల్గోట్ ప్రమోద్, మత్స్యకారుడు, సిరికొండ

టెండర్ పూర్తయ్యాక



చేప పిల్లల సరఫరా ప్రక్రియ ప్రస్తుతం టెండర్ల దశలో ఉంది. టెండర్ పూర్తికాగానే చేప పిల్లలను మత్స్యకారుల ద్వారా చెరువుల్లో, కుంటల్లో, ప్రాజెక్టుల్లో వదిలే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. మత్స్యకారుల సంఘం ప్రతినిధులకు ఎప్పటికిప్పుడు శాఖాపరంగా సమాచారం అందిస్తున్నాం.

– సురేశ్, జిల్లా మత్స్యశాఖ అధికారి



మల్లాపూర్: మండలంలోని రాఘవపేట 6 వ వార్డులో మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ డ్రైయినేజీలో మురుగునీరు ప్రవహించే మార్గం లేక డ్రైయినేజీ దుర్గంధంతో రోగాల బారిన పడాల్సి వస్తుందోనని ఆ వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటిలోని దోమలు కుట్టడం వల్ల విష జ్వరాల బారిన పడుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మోహన్, పంచాయతీ కార్యదర్శి, రాఘవపేట, సెల్ నంబర్: 8500052274

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాయని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల అసెంబ్లీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం కోరుట్ల నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయక్‌పోడ్ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే కోరుట్ల సెగ్మెంట్‌లో సుమారు 3 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించామని వీటిలో చాలా మటుకు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. 20 ఏళ్ల క్రితం దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు ఒక్క కోరుట్ల పట్టణంలోనే సుమారు 3వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టించారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించకుండా కాలనీవాసులను నానా ఇబ్బందుల పాలు చేశారన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేస్తే వారికి తన తరపున రూ.10 వేలు నజరానా ఇస్తానన్నారు. అవినీతికి తావు లేకుండా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్, తిరుమల గంగాధర్, సోగ్రాబీ, అక్బర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న అశోక్, నాయకులు

జగిత్యాలటౌన్: విద్యా,ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించి రాజ్యాంగ రక్షణ కల్పించిన అంబేడ్కర్ మహిళలకు సమాజంలో మరింత గౌరవం పెరిగేలా చేశారని ప్రముఖ న్యాయవాది మ్యాదరి అశోక్ అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి అశోక్ ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా ఉద్యోగాలతో పాటు సామాజికంగా వివక్షకు గురైన మహిళలకు సముచిత స్థానం కల్పించిన అంబేడ్కర్ స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకుడు నల్ల శ్యాం, మద్దెల నారాయణ, గడ్డల లక్ష్మి, అనంతుల కాంతారావు, ప్రభాకర్, రమణ, జవ్వాజి శంకర్, అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామ శివారులోని వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. పోలీస్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ కనిపించిందన్నారు. ఇసుకను దూలూర్ నుంచి నిజామాబాద్ జిల్లాకు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు నిజామాబాద్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ ఎం.డీ నజీర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

అంగడి ఆనంద్‌కు విశ్వకర్మ జాతీయ పురస్కార్ అవార్డు

మేడిపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న ఉత్తమ సేవలకు మాజీ సర్పంచ్, జీర్స్‌ ₹ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ అంగడి ఆనంద్ విశ్వకర్మ జాతీయ పురస్కార్ అవార్డుకు ఎంపికయ్యారు. శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన విశ్వ పరిషత్, తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ వరల్డ్ రికార్డ్ సంయుక్తంగా అందిస్తున్న ఈ అవార్డును అంగడి ఆనంద్ కుమార్‌కు ఆదివారం హుస్నాబాద్‌లో నిర్వాహకులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కెడం లింగమూర్తి, అక్కినపల్లి భాస్కర చారి, విష్ణువర్, అద్దంకి నాగరాజు ఆశ్చర్య, రాజకుమార్ చారి, ఉమ్మడి మేడిపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మడి రవి, నాయకులు బొమ్మన ప్రశాంత్, బోలోజి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్ కుటుంబానికి న్యాయం చేయాలి

జగిత్యాలటౌన్: కుల దురహంకార హత్యకు గురైన సల్లూరి మల్లేశ్ కుటుంబానికి న్యాయం చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు కోరారు. పెరుమాళ్ల ప్రణయ్ ఏడో వర్ధంతి సందర్భంగా ఆదివారం జగిత్యాల అంబేడ్కర్ భవన్ సల్లూరి మల్లేశ్ సంస్మరణ సభ నిర్వహించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్ కేవైరత్నం అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య వక్తలుగా హెచ్‌సీయూ ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)ప్రొఫెసర్ వెంకటదాసు, మహ్మద్ మొహినొద్దీన్, ఎం స్వామిదాసు, శాబాజ్ అహ్మద్, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షురాలు గన్నారపు సరోజన, ఆలిండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జగిత్యాల జిల్లా నాయకులు సురేష్ ఐద్వా నాయకురాలు పద్మతో పాటు సల్లూరి మల్లేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భక్తుల తాత్కాలిక వసతి కోసం మరో షెడ్డు నిర్మాణం

మల్యాల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యం కోసం ప్రస్తుత కల్యాణకట్ట సమీపంలో మరో షెడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కార్యాలయ భవనం ఎదుట హనుమాన్ జయంతి సందర్భంగా దీక్షాపరులు, భక్తుల వసతి కోసం షెడ్డు ఏర్పాటు చేయగా, ఆలయ సమీపంలోని కల్యాణకట్ట ఎదుట మరో షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రాత్రివేళ నిద్రించటంతోపాటు, వర్షాకాలం, వేసవికాలంలో భక్తులు సేదతీరేందుకు, కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తుల రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్ రావు తెలిపారు.

ముగిసిన బ్లాక్ లెవల్ క్రీడలు

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 13 నుంచి 14 వరకు నిర్వహించిన బ్లాక్ లెవల్ క్రీడలు (టోర్నమెంట్) ఆదివారం ముగిశాయి. నెహ్రూ యువ కేంద్రం మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా యూత్ అధికారి రాంబాబు హాజరై ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్రీడా పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, తదితర క్రీడలు నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన టీంకు బహుమతులు అందజేశారు. వాలీబాల్ విభాగంలో నక్కలపేట జట్టు ప్రథమ స్థానంలో నిలువగా రామయ్యపల్లె జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అదే విధంగా కబడ్డీ పోటీల్లో నక్కలపేట ప్రథమ స్థానం, రామయ్యపల్లి ద్వితీయ స్థానంలో నిలిచింది. అథ్లెటిక్స్, పరుగుపందెం,బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ భూమేశ్, గణేశ్ ప్రోగ్రామ్ ఆర్గనైజర్ వినోద్, చందు, వెంకటేశ్ పాల్గొన్నారు.

తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎంల నూతన కార్యవర్గం

జగిత్యాలటౌన్: తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాజా భానుచంద్ర ప్రకాశ్ ఆదివారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా గజ్జెల నరేందర్, ప్రధాన కార్యదర్శిగా దండె రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీబాయి, కె ప్రభాకర్, ఎండీ అస్పాక్‌హుస్సేన్, రాఘవేందర్,సదాశివ్, మధుసూధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రకాష్, చంద్రమోహన్‌రెడ్డి, రాధారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు భానుచంద్రప్రకాశ్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా హెచ్‌ఎంలకు ప్రమోషన్లు కల్పించలేదన్నారు. సర్వీస్ రూల్స్ రూపొందించి ఉప విద్యాధికారి, డైట్ లెక్చరర్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే వేసవి సెలవుల్లో ప్రమోషన్లు కల్పిస్తూ బదిలీలు చేపట్టాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మల్యాల: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని, ప్రతీ ఒక్కరు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్ అన్నారు. మల్యాల మండల కేంద్రంలో ఆదివారం ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన 27మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, ఆకుతోట శ్రీనివాస్, సుధీర్‌కుమార్, వడ్లూరి శ్రావణ్, ఇనుగుర్తి రాజశేఖర్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తేవాలి

పెగడపల్లి: రానున్న స్థానిక సంస్థల్లో అధిక స్థానాల్లో గెలుపొంది బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తేవాలని పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. మండలంలోని వెంగళాయిపేటలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంతో పని చేయాలని కోరారు. నాయకులు వెంకన్న, తిరుపతి, శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తిరుపతినాయక్, లక్ష్మన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జగిత్యాల జిల్లా కేంద్రంలోని నిర్వహించిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు మనీషా, మేఘన, హారిక, సౌమ్య, లక్ష్మీ ప్రసన్న, తేజస్విని, యశస్విని రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ మధులిక తెలిపారు.

గుంతలు పూడ్చివేత

సాక్షి స్పందన



గుంతలు పూడ్చుతున్న మున్సిపల్ సిబ్బంది

కోరుట్ల టౌన్: పట్టణంలోని వినోభారోడ్ ప్రధాన రహదారిలో నీటితో నిండిన గుంతలు ప్రమాదకరంగా మారాయని సాక్షి లో ఇటీవల వాట్సాప్ ఫొటో స్టోరీ రాగా, ఈ క్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ స్పందించి, మున్సిపల్ సిబ్బందితో ప్రమాదకర నీటి గుంతలను ఆదివారం పూడ్చి వేశారు. గుంతలు పూడ్చి వేయడంతో కాలనీ ప్రజలు మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత వైద్య శిబిరం

మల్యాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం ఐఎంఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, చర్మసంబంధమైన వ్యాధులు, చెవి,ముక్కు, గొంతు, దంత సమస్యలకు సంబంధించిన వివిధ పరీక్షలు నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఎస్.శ్రీనివాస్, ఆకుతోట శ్రీనివాస్, ఆగంతపు నరేశ్, సుదీర్‌కుమార్, రాజశేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

మల్యాలలో బహుజన ముక్తి మోర్చా సమావేశం

మల్యాల:మండల కేంద్రంలో బహుజన ముక్తి మోర్చా ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల ఆధారిత కులగణన చేయాలని, ఈవీఎంలు రద్దు చేసి, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విద్యా, ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రేవెల్లి రవీందర్, బీఎంపీ రాష్ట్ర నాయకులు రఘువీర్, నీరటి రవీందర్, జితేందర్, గంగ నర్సయ్య, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ సభ్యులు న్యాయవాది బొల్లి కిషన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో పర్వ రాజయ్యకు చెందిన రెండు గొర్రెలు ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. రాజయ్య గొర్రెల మంద కొండాయపల్లి శివారులోకి మేతకోసం వెళ్లగా, పంట పొలాల మధ్యనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తీగ తగిలి రెండు గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. రూ. 30 వేల విలువ గల గొర్రెలు మృతి చెందాయని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలి

వెల్గటూర్: సేవా కార్యక్రమాలతో ప్రజలకుచేరువ కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్ధన్ అన్నారు. ఆదివారం కిషన్‌రావుపేటలో సేవాపక్షం కార్యశాలకు జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 17న ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు పక్షం రోజులు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జీవన్‌రావు, వెంకటగిరి, సుమన్, చక్రపాణి, శ్రీధర్, తిరుపతి, నరేష్, మహేశ్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ రోడ్డు పనులు ప్రారంభం

కథలాపూర్: మోడల్‌స్కూల్ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. కథలాపూర్‌లో మెయిన్ రోడ్డు నుంచి మోడల్ స్కూల్ వరకు సీసీరోడ్డు కోసం 10 నెలల క్రితం నిధులు రూ.1.30 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. ఎట్టకేలకు కాంట్రాక్టర్ ఆదివారం పనులను ప్రారంభించారు. సీసీరోడ్డు నిర్మాణం కోసం మట్టిని తొలగించి లెవలింగ్ చేసే పనులను చేపడుతున్నారు. నిధులు మంజూరయ్యాక 10 నెలల తర్వాత పనులు ప్రారంభం కావడంతో ఇన్నాళ్లకు రోడ్డు పనులకు మోక్షం లభించిందని విద్యార్థులు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మేడిపల్లి: మండల ముఖ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు మండలంలోని తొంబరావుపేట గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో కలిసి గ్రామంలోని ప్రదాన సమస్యల గురించి చర్చించారు. గ్రామంలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేడిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్, చేపూరి నాగరాజు, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మార్గం నర్సారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జలంధర్ రెడ్డి, బలగం రాజేష్, నాయకులు పాల్గొన్నారు.